# శాంతి

యర్రమిల్లి విజయలక్ష్మి

**మూ**డో పిల్ల పురిటికని అల్లుడు గారింటికి వచ్చింది శాంతమ్మ. ఆవిడా అంతంత మాత్రం మనిషే. జీవితపు ఆటుపోట్లలో అరిగిపోయి - ఆర్చుకుపోయిన మనిషి. ఎండిపోయిన చర్మం. వదులొదులుగా ఎముకల గూడుకు చర్మం ముసుగు కప్పినట్లుంటుంది తప్ప ఎక్కడా వంట్లో కండ సత్తువ లేదు. అయినా తప్పదు.... కడసారి పిల్ల. పెళ్ళి చేసి పంపి ఏణ్ణార్థం కావస్తోంది. తొలి కాన్పు. ఈ సమయంలో తల్లి దగ్గర వుండటం ఎంతో అవసరం. పిల్లకు ధైర్యం కావాలి కదా....!

"కాన్పు కష్టమయ్యేట్లుంది. అవసరమైతే ఆపరేషన్ చెయ్యాల్సి వుంటుంది. హాస్పిటల్లో వుంచండి" అంది డాక్టరమ్మ. రెండ్రోజులైంది చేర్చి. ఎక్కడా కదలిక - మెదలిక లేదు. అత్తింటి వాళ్ళు. తల్లి - షిప్టుల్లో డ్యూటీలు నిర్ణయించుకుని హాస్పిటల్‌కి ఇంటికి మధ్య ఆసులో కండెలా తిరుగుతున్నారు.

'ఏవిటో.... మరీ అపురూపాలు... ఎక్కడా పిల్లల్ని కని పెంచే సత్తువే లేదు పిల్లలో.....! తన రోజుల్లో ఎట్లా వుండేది. అమ్మ ఏం పెట్టి పెంచిందో కాని ఎంతో ఆరోగ్యంగా వుండే వాళ్ళం. ఇప్పుడంటే వయసు పైబడింది..... సత్తువ తగ్గింది కాని....! లేకపోతే వీళ్ళంతా భూమి మీద పడేవారా....? పెరిగేవారా.... వచ్చి నాల్రోజులైంది.... అక్కడ పరిస్థితులెలా వున్నాయో.... అల్లుడుగారు వచ్చి పరిస్థితి అంతా వివరించి మరీ మరీ అడగబట్టి తన్నిక్కడికి పంపారాయన. ఎప్పుడు వదిలిరాం ఎక్కడికీ వెళ్ళ లేదు.... మంచి నీళ్ళు తీసుకుని తాగటం కూడా రాదాయనకి....?" శాంతమ్మ మనసు ఇంటి మీదకు పోయింది. సాధారణంగా ఆవిడ భర్తను గురించి - ఇంటిని గురించి ఆలోచించదు. ఆవిడకసలు తానుగా ఆలోచించటం తెలియదు. చిన్నప్పుడు అమ్మ, నాన్న ఆలోచించి తనేం చెయ్యాలో.... ఏం చెయ్య కూడదో..... ఎలా వుండాలో.... ఎలా వుండ కూడదో... చెప్తే 'ఊఁ....ఆఁ' అనకుండా అల్లాగే చేసేది. పద్నాలుగో ఏట పెళ్ళయ్యాక ఆవిడ తరఫున ఆలోచించటం భర్తకు బదలాయించటం జరిగింది. అమ్మ నాన్న పెళ్ళి చేసి పంపిన దగ్గర్నించి మరీ ఒక మూగ జీవిలా - మరయంత్రంలా - నోరులేని గానుగెద్దులా మారిపోయింది. ఆమెకు శ్రమించే శరీరమే తప్ప మనసు - మెదడు - బుద్ధిలాటివి వున్నట్టు కనపడదు. తనింట్లో తానే బితుకు, బితుకు మంటూ - ఆయనగారి దాష్టీకానికి భయపడిపోతూ.... ఒదిగి, ఒదిగి ఒక కట్టు బానిసలాగే బతుకు వెళ్ళమారుస్తోంది. పిల్లలు కలిగినా - వయసు పెరిగినా ఆమె స్థితిలో మార్పు రాలేదు. పరశురామయ్య స్వతహాగా ముక్కోపి. అహంకారంతో పెద్దలిచ్చిపోయిన ఆస్తంతా నాశనం చేసుకున్నాడు. ఆస్తి ఉందన్న ధైర్యంతో 'ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మ నాకేమిట'ని వయసులో ఉండగా



ఏపనీ చెయ్యకుండా జల్సాగా గడిపాడు పరిస్థితి తల క్రిందులయ్యాక చేస్తానన్నా పని దొరక లేదు. ఇల్లు - తోటలు.... పంట పొలాలు కరిగిపోయాయి. ఇక ఇల్లాలి వంటి మీద నగలు ఒక్కటొక్కటి కరిగించుకుని కాలక్షేపం చేస్తున్నాడు. వృద్ధాప్యం పైబడుతుంటే ఉన్న అశాంతికి తోడు శాంతమ్మను లేమి కూడా ఆవరించింది. ఆ నోటి దురుసు తనానికి జడిసి అడిగినప్పుడల్లా ఏదడిగితే అది వంటి మీద ఉన్నవన్నీ ఒక్కొక్కటీ వలిచిచ్చింది.

ఏం ఉంది...? ఈ తాళి బొట్టు తప్ప....? అరిగిపోయి... సొట్టలు పడిన రెండు బంగారు రేకులు.... నల్లపూసల మధ్య....' నర్సు వచ్చి గదిలో లైటు వేసింది కాంతమ్మ మెడలో వేలాడుతున్న పసుపుతాడు పైకి తీసుకుని - మంగళ సూత్రాలు భక్తితో కళ్ళకద్దుకుంది.

ఇక్కడికి రావాలంటే పైసలు లేవు.... ముందు 'వద్దు పొమ్మన్నా'రు. కానీ పరిస్థితి అర్థం చేసుకున్నారేమో - డబ్బు కోసం ఎక్కడెక్కడో ప్రయత్నించారాయన. అప్పు దొరకలేదు. 'తాళి బొట్టు ఇస్తే ఎక్కడన్నా వుంచి డబ్బు తెస్తాన'ని...! తను ససేమీరా ఒప్పుకోలేదు అట్టాటి అపశకునపు పన్లు చెయ్యటం తన కిష్టం లేదు. కోపంతో చిందులు తొక్కారు. కొట్టినంత పని చేసారు. మొత్తానికెల్లాగో ఆయనే డబ్బు సర్దుబాటు చేసి పంపారు. ఆ..... ఏం డబ్బులే ఛార్జీలు పోను పది రూపాయలు మిగిలింది చేతిలో.

✳ ✳ ✳

శాంతమ్మ మూడో అల్లుడు రామారావు వచ్చాడు. అతనక్కడ సూపర్ బజార్లో పనిచేస్తున్నాడు. వస్తూనే చెప్పాడు..... భార్యకు వినపడకుండా అత్తగార్ని పక్కకు పిలిచి -

"మావగారికి వళ్ళు బాగాలేదట....? కబురొచ్చింది.... త్వరగా రండి.... మిమ్మల్ని బస్సెక్కించి వస్తాను నేను రావటానికి కుదరదు....

శాంతమ్మ గుండె దడ.... దడ లాడింది. 'ఏం జరిగిందిట...? నేను వచ్చేటప్పుడు బాగానే వున్నారుగా..." అంది ఆరాటపడుతూ.

"ఏం భయం లేదమ్మా.... మీరు దగ్గరుంటే మంచిదని రమ్మన్నారు.... పదండి బస్సుకి టైమవుతోంది...." అన్నాడు ఆవిడ కోసం వచ్చిన మనిషి ధైర్యం చెప్తూ....


"ఏవిఁటో నాకేమీ పాలుపోవటం లేదు.... అమ్మాయి చూస్తే ఇలా వుంది. తెల్లారి ఆపరేషను చేస్తానంది డాక్టరమ్మ.... ఆయనకేం జరిగిందో అర్థం కావటం లేదు..... బాబూ అమ్మాయి జాగ్రత్త దాన్ని గట్టెక్కించకుండా వెళ్ళాల్సి వస్తోంది....". అంటూ కన్నీళ్ళతో బస్సెక్కింది శాంతమ్మ.

ఆవిడ మనసు పరిపరి విధాల పోతోంది. మనసు అంతులేని అలసటకి గురౌతోంది. 'ఏం జరిగిందో.... ఆయనకి...!' అనుకుంటే మనసు కదిలిపోతోంది. భయంతో గుండెలదిరి పోతున్నాయి. దిక్కుతోచక కళ్ళు మూసుకుని దేవీ స్తోత్రం చదువుకుంటోంది. మనసు లగ్నం కావటం లేదు. అమ్మా....లలితా... గాయత్రి... నీవే దిక్కు.... ఆయన్ని చల్లగా కాపాడు తల్లీ....! అమ్మవారి రూపానికి బదులుగా భర్త కళ్ళలోకి వస్తున్నాడు. నిలువెత్తు మనిషి... దృఢకాయుడు.... గుబురు మీసాలు.... వెండి తీగల్లా జుట్టు - ఎరుపు జీరలు తేలిన లోతు కళ్ళు... ఆ రూపాన్ని తలచుకుంటే చాలు ఆమె మనసు వణుకుతోంది. అందుకే దూరంగా వుంటే తలచుకునే అలవాటు.... దగ్గర వుంటే కళ్ళారా చూసుకుని మనసునిండా నింపుకునే కోరికా లేదు కాని ఈ క్షణంలో ఆమె ప్రమేయం లేకుండానే ఆయన పదే పదే కళ్ళ ముందు మెదులుతున్నాడు. తిడుతున్నట్లు.... కొడుతున్నట్లు.... చెయ్యి చేసుకునే ఓపిక లేక చేతి కర్ర మీదకు విసురుతున్నట్టు.... ఇలా కాకుండా ఇంకో రకంగా భర్తను స్మరించుకోవాలనుకుంది మంచి మనిషిగా మనసులో నిలుపుకోవాలనుకుంది. బొమ్మల పెళ్ళి చేసే వయసులో జరిగిన పెళ్ళి. మంచి సంఘటనలేమీ గుర్తురావటం లేదు భయంతో బిగుసుకుపోతూ - దాష్టీకానికి జడిసిపోతూ కళ్ళు మూసుకుని వెలగబెట్టిన కాపుర ఘట్టాలు కొన్ని పలకరిస్తున్నాయి. అన్నీ చేదు అనుభవాలే! తిట్టినా - కొట్టినా పురుషాహంకారంతో ఏం చేసినా సహనంతో భరిస్తూ శాంతంగా సహిస్తూ పాతివ్రత్యాన్ని పాటిస్తూ వంచిన తల ఎత్తకుండా అణిగి, మణిగి బతికింది. ఉత్తమ ఇల్లాలనిపించుకుంది.

ఊరు చేరువవుతోంది. ఉద్వేగం పెరిగిపోతోంది. ఏం చూడాల్సి వస్తుందో. ఎల్లా వున్నారో..... కుడి కన్ను ఆగకుండా అదురుతోంది. తెలియని వెరుపుతో గుండెలార్చుకు పోతున్నాయి. అమ్మవారిని తలుచుకుంటూ ఎండిపోయిన గుండెల మీద బలహీనంగా వేలాడుతున్న పసుపు తాడు పైకి తీసుకుని పదే పదే సూత్రాలు.... మళ్ళీ మళ్ళీ కళ్ళకద్దుకుంటోంది.


✳ ✳ ✳

"శాంతమ్మ గారు..... శాంతమ్మగారు.... అయ్యో.... పాపం! వస్తోంది...." ఆయాసపడుతూ



## అవార్డులపై చిన్న చూపు

*'లగాన్' హీరో అమీర్‌ఖాన్ విదేశీయులు ఇచ్చే అవార్డే నిజమైనదని అంటున్నాడు. ఆస్కార్ అవార్డు దక్కించుకోలేకపోయిన అమీర్‌ఖాన్‌కు స్వదేశంలో లభించే అవార్డులు లెక్కలోకి రావడంలేదు. 'లగాన్'కు ఎన్నో అవార్డులు ఇచ్చి ఉత్తమ చిత్రంగా భావిస్తున్న మనదేశంలోని అవార్డులంటే అమీర్‌ఖాన్‌కు చిన్న చూపుగా ఉంది. (అమీర్ ఇలా భావించడం తగునా?)*



దడ-దడ లాడుతూ వస్తున్న శాంతమ్మను చూసి అక్కడ చేరి వున్న ఇరుగు పొరుగు స్త్రీలు సానుభూతి ప్రకటిస్తున్నారు. బరువుగా నిట్టూరుస్తూ.... దీనంగా తలలు వాల్చి మౌనంగా చెట్ల క్రింద మగవాళ్ళు కొందరు కనిపిస్తున్నారు.

ఎప్పుడూ నిశ్శబ్దంగా - ఎవరి రాకకూ నోచుకోక నిశ్శబ్దంగా వుండే ఆ పూరింటి ముంగిట కలకలం 'వాడకట్టున వుండే పెద్ద - పెద్ద వాళ్ళంతా వున్నారేమిటి? ఏమిటింతమంది జనం వచ్చారు? ములాయన కంత అనారోగ్యంగా వుందా ఏమిటి?' శాంతమ్మ భయంతో కడబట్టిపోతున్న గుండెలతో - ఒగురుస్తు గాలికి ఎగిరి పడుతున్న ఎండుటాకులా గుమ్మంలోకి వచ్చి పడింది. అక్కడ పంచలో భయంకరంగా ఎదురైన దృశ్యం ఆమె మనసుకు చప్పున ఎక్కలేదు. దిగ్భ్రాంతితో కట్టెలా అట్టె బిగుసుకుపోయిన శాంతమ్మ దగ్గరకు పరుగు వచ్చి..... "అమ్మమ్మా..... తాతయ్యా...." అని బావురుమంటూ కాళ్ళు వాటేసుకున్నాడు మనువడు. అమ్మాయి గోడ వారగా కూర్చుని మోకాళ్ళలో తల దూర్చుకుని ఏడుస్తోంది. పాత పట్టా మీద ముఖం కనపబడేలా తెల్లని గుడ్డ కప్పి వుంది పరశురామయ్య శరీరం. చూడగానే మాటపలుకూ లేకుండా దబ్బున కుప్పకూలిపోయింది శాంతమ్మ. ఎవరో ముఖాన నీళ్ళు చల్లారు, మంచి నీళ్ళు తాగించారు.

'ఓరి దేవుఁడో.... ఎంతపని చేసావురో.... నన్నటుపంపి నా పసుపు, కుంకుమ లెత్తుకెళ్ళావు కదరో.... అయ్యో.... దేవుడా నేనేం పాపం చేసానురా.... కడసారి చూపన్నా మిగలకుండా చేసావు! పైట చెంగు ముఖాన వేసుకుని కుమిలిపోతున్న వృద్ధురాల్ని ఇరుగు, పొరుగు స్త్రీలు ఓదారుస్తున్నారు. కొందరు మగ వాళ్ళు పూనుకుని జరగవలసిన ఏర్పాట్లు చేస్తున్నారు.

శాంతమ్మ గుండె భళ్ళున పగిలిపోయింది. నీరెండిన గాజు కళ్ళతో భర్త కట్టెను చూస్తూ కూర్చుంది నెత్తిన చెయ్యి వేసుకుని పరశురామయ్య దాష్టీకానికీ, దౌర్జన్యానికి, నిరంకుశత్వానికి శాంతమ్మ జీవితం - కన్నీరు ఖర్చైపోయింది. ఇంకిపోయిన సౌభాగ్యం కోసం కాని తన దౌర్భాగ్యం కోసం కాని వెచ్చించటానికి కన్నీరేమి మిగలలేదు.

'కష్టాలు పడి, పడి కాలిన ఉలిపి కట్టెలా తయారైంది. ముందు ఈవిడే అనుకున్నాం.... పాపం ఈ గతి పట్టింది చివరికి! నిన్నటి దాకా ఆరోగ్యంగా తిరిగాడు ఇంతలో ఏమొచ్చిందో...' చుట్టూ చేరిన వారెవరో గుస, గుసలాడుకుంటున్నారు.

'అవును తల్లీ.... ఏమీ ఇవ్వకపోయినా పసుపు కుంకుమలతో పునిస్త్రీగా వెళ్ళిపోయే భాగ్యమన్నా ఇస్తాడనుకున్నా.... ఈ బతుక్కి అదీ లేకుండా చేసాడా దేవుడు....' శాంతమ్మ మనసంతా చిత్రమైన నిర్లిప్తత ఆవరించింది. అంతా పూనుకుని త్వరత్వరగా ఏర్పాట్లు పూర్తి చేశారు. స్తబ్దమైన నిర్జీవ శరీరాన్ని శాంతమ్మ దిగులుగా చూస్తోంది. ఎన్నడూ ఆ ముఖంలోకి చూసే ధైర్యం చెయ్యలేదు. ఆయన్ని ఎప్పుడూ అంత నిశ్శబ్దంగా, శాంతంగా, నిర్వికారంగా చూడలేదు. బండలైన గుండెలతో పతి దేవుని పాదాల మీద పడి అంతిమ నమస్కారం చేసింది.

మౌనంగా, భారంగా నారాయణ ఘోషతో పరశురామయ్య అంతిమ యాత్ర సాగిపోయింది. వంటరిగా వెనుక నిలబడిపోయింది శాంతమ్మ. చిత్రమైన శాంతి ఏదో ఆమె దుఃఖిత హృదయాన్ని మెల్లమెల్లగా సేద తీరుస్తోంది. ❋

